పత్రికా ప్రకటన కాకినాడ, ఆగస్టు 5, 2021

రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి నేతృత్వంలో సంక్షేమ పాలనతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు లక్ష్యంగా సంస్కరణల అమలు జరుగుతోందని.. ఇందులో భాగంగా ఉద్యమంలా చేపట్టిన జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో ప్రజలు కీలక భాగస్వాములై ఆకుపచ్చని ఆశయాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కృషిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కురసాల కన్నబాబు పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలోని వాకలపూడి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జగనన్న పచ్చతోరణం జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కన్నబాబు.. కలెక్టర్ సి.హరికిరణ్, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, జేసీ (ఆర్) డా. జి.లక్ష్మీశ, జేసీ(డీ) కీర్తి చేకూరి, జేసీ(ఏ అండ్ డబ్ల్యూ) జి.రాజకుమారి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.నాగేశ్వరరావు తదితరులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ మొక్కలను దత్తత తీసుకున్న విద్యార్థులతో ముచ్చటించి, పచ్చదనం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైదానం, మెట్ట, అటవీ భూమితో భౌగోళికంగా వైవిధ్యమున్న; వ్యవసాయం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా కొత్త కలెక్టర్ సి.హరికిరణ్ నేతృత్వంలో మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న పచ్చతోరణం నిశ్శబ్దంగా మంచి ఫలితాలు ఇస్తుందని, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. మన పూర్వీకులు నాటిన మొక్కల నుంచి నేడు మనం ఎంతో ప్రయోజనం పొందుతున్నామనే విషయాన్ని గుర్తించి, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. మండలం, డివిజన్ వారీగా లక్ష్యాలు నిర్దేశించి మొక్కలు పెంచడంతో పాటు వాటి పరిరక్షణకూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అటవీశాఖ.. వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి కల్పన విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం పరిధిలో రాష్ట్రంలోని 17 వేల లేఅవుట్లలో కొత్త ఊళ్లు రాబోతున్నాయని.. వీటిలో ప్రణాళిక ప్రకారం పచ్చదనం పెంపొందించాల్సిన అవసరముందన్నారు. పంచాయతీలు కూడా ఆదాయం వచ్చేలా మొక్కలు నాటాలని, ఈ ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చన్నారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మంత్రి కన్నబాబు పిలుపునిచ్చారు. కోవిడ్ ముప్పు తొలగనందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకొని స్వీయ రక్షణ చర్యలు పాటించాలని సూచించారు.

<u>హరిత విస్తీర్ణం పెంపునకు కృషి: కలెక్టర్ సి.హరికిరణ్:</u>

గౌరవ ముఖ్యమంత్రి జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని 2019లో ప్రారంభించారని, ఈ కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందని.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం కోటి మొక్కలను నాటడం లక్ష్యంగా ఉండగా.. మన జిల్లాలోనే కార్యక్రమం అమలుకు 42 లక్షల మొక్కలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ సి.హరికిరణ్ తెలిపారు. పాఠశాలలలు, హాస్టళ్లు, కార్యాలయాలు, రహదారులు వెంబడి ఇలా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో దాదాపు 35 శాతం అటవీ, చెట్ల హరిత విస్తీర్ణం ఉందని.. అయితే ఇందులో 25 శాతం వరకు ఎటపాక, రంపచోడవరం వంటి ఏజెన్సీ ప్రాంతానికే పరిమితమైందని, పది శాతం మాత్రమే ఏజెన్సీకి బయట ఉందన్నారు. అందువల్ల ఏజెన్సీ బయట ప్రాంతంలోనూ పెద్ద ఎత్తున పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

1988 జాతీయ అటవీ విధానం ద్వారా 33 శాతం అటవీ విస్తీర్ణం లక్ష్యాన్ని నిర్ణయించి, ఇప్పటికి 33 ఏళ్లు అయిందని వివరించారు. అభివృద్ధి కార్యకలాపాలకు సమాంతరంగా అటవీ, పచ్చదనం విస్తీర్ణం పెంపునకు కృషిచేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ కోసం చాలా ఇబ్బందిపడ్డామని.. భవిష్యత్తులో సాధారణ పరిస్థితుల్లోనూ ఆక్సిజన్ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి రాకూడదంటే మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇన్‌స్టిట్యూషనల్, బ్లాక్, అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా హరిత విస్తీర్ణాన్ని పెంచి, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో జగనన్న పచ్చతోరణం జిల్లాస్థాయి కార్యక్రమం కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలో ప్రారంభమైందని, ఈ సందర్భంగా మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు కురసాల కన్నబాబు సూచన మేరకు తొలిదశలో నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఒకటి చొప్పున ఫలసాయం లభించే జామ, తులసి, మారేడు, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, దేవకాంచనం తదితర మొక్కలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సి.హరికిరణ్ వెల్లడించారు.

- ఎస్‌పీ ఎం.రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ నేటి యువతరం పచ్చదనం ఆవశ్యకతను గుర్తించి.. ఆ దిశగా కృషిచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. వివిధ శుభకార్యక్రమాల సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు మాట్లాడుతూ మొక్కలతో పాటు వివిధ జీవుల సంరక్షణ ద్వారా ఆవరణ వ్యవస్థ సమతుల్యమవుతుందని.. అందువల్ల ఇందుకు దోహదం చేసే మొక్కలను ఎంపికచేసి, నాటాల్సిన అవసరముందని సూచించారు. మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా మృత్తికా క్రమక్షయాన్ని అరికట్టవచ్చన్నారు.

- కార్యక్రమం సందర్భంగా హెల్దీ ఇండియా ఆర్ట్ కాంపిటేషన్-2021లో హెల్దీ ఇండియా ఆర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డు పొందిన 9వ తరగతి విద్యార్థి ఇ.భువనేశ్వర్‌ను మంత్రి కురసాల కన్నబాబు, కలెక్టర్ సి.హరికిరణ్, జాయింట్ కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఐకేవీ రాజు, డీఎఫ్‌వో (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.శ్రీనివాస్, డ్వామా పీడీ ఏ.వెంకటలక్ష్మి, కాకినాడ ఆర్‌డీవో ఏజీ చిన్నికృష్ణ, కాకినాడ రూరల్ ఎంపీడీవో పి.నారాయణమూర్తి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది  తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖ జారీ)